నమస్తే తెలంగాణ
నల్లగొండ
10 నల్లగొండ, బుధవారం 26 మార్చి 2025 NALGONDA



సూర్యాపేట జిల్లా కేంద్రంలో ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

# ముస్లింల ఉపవాస దీక్షలు ఫలించాలి

- అన్ని మతాల పండుగలను గౌరవించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దే
- ఒకరి మతాన్ని మరొకరు గౌరవించుకునే విధానానికి శ్రీకారం
- ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, మార్చి 25 : పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు చేసే కఠిన ఉపవాస దీక్షలు ఫలించాలని. అల్లా ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ముస్లింలతో ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందడుగు వేసి అన్ని పండుగలను గౌరవించారన్నారు. తెలంగాణలో గంగ జమునా తెహజీబ్‌లా ఒకరి పండుగలను ఒకరు గౌరవించే విధానం రావాలని, అది ప్రభుత్వంతోనే మొదలు కావాలని భావించారని తెలిపారు. అందులో భాగంగానే దసరాకు బతుకమ్మ చీరెలు, క్రిస్మస్‌కు కానుకలు, రంజాన్‌లకు తోఫాలు అందజేశారని, విందులు ఏర్పాటు చేశారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అద్భుతమైన సంప్రదాయానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం దీన్ని కొనసాగిస్తూ ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ముస్లింలు ప్రశాంత వాతావరణంలో రంజాన్‌ను జరుపుకోవాలని కోరుతూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ఏఐసీసీ సభ్యులు సర్వోత్తంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎస్‌కే తాహేర్ పాషా, సయ్యద్ రియాజుద్దీన్, సయ్యద్ సలీమ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజద్ అలీ, ఇమామ్‌లు, మౌజన్‌లు తదితరులు పాల్గొన్నారు.

# అవగాహన లోపం.. షెడ్ల నిర్మాణంలో జాప్యం

## పశువుల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం వంద శాతం రాయితీ

- సూర్యాపేట జిల్లాలో 1,660 యూనిట్లు మంజూరు.. ఇప్పటి వరకు 696 షెడ్ల నిర్మాణం పూర్తి
- ఈ నెలాఖరుకు గడువు పూర్తి..
- పథకానికి దూరమైన చాలా మంది రైతులు



నేరేడుచర్ల మండలం మేడారంలో నిర్మించిన షెడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ సోమసుందర్ రెడ్డి

నేరేడుచర్ల, మార్చి 25 : పశువులకు నీడ కల్పించాలనే సంకల్పం అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరుగారుతున్నది. క్షేత్రస్థాయిలో అవగాహన కొరవడటంతో నిర్మాణాలు పురోగతికి నోచుకోవడం లేదు. ఉపాధి హామీ పథకం కింద మూగజీవాల కోసం వంద శాతం రాయితీపై షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం యూనిట్లు మంజూరు చేస్తున్నది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 1,660 మంది రైతులకు ఈ పథకం యూనిట్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 696 మాత్రమే పూర్తయ్యాయి. అసలు ఈ యూనిట్ ఉందనే విషయం చాలా మంది రైతులకు తెలియదు. ఈ పథకంపై గ్రామాల్లో ప్రచారం లేక పోవడంతో దరఖాస్తు చేసుకోలేక పోయారు. యూనిట్ మంజూరైన వారికి సైతం సరైన అవగాహన కల్పించకపోవడంతో నిర్మాణంలో జాప్యం జరుగుతున్నది.

### జిల్లాలో 1,660 యూనిట్లు మంజూరు

గత సంవత్సరం నవంబర్, డిసెంబర్‌లో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 1,660 మంది దరఖాస్తు చేసుకోగా వారందరినీ ప్రభుత్వం అర్హులుగా గుర్తించి యూనిట్లు మంజూరు చేసింది. షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 85వేలు చెల్లించడంతో పాటు ఈ మొత్తానికి రాయితీ ఇస్తుంది. ఉపాధి జాబ్ కార్డు, ఐదెకరాల వ్యవసాయ భూమితో పాటు మూడు పశువులు కలిగి ఉన్న వారిని అర్హులుగా నిర్ణయించింది. గ్రామసభ తీర్మానం పొందిన తర్వాత అర్హులుగా నిర్ణయిస్తారు. లబ్ధిదారుడు డబ్బులు వెచ్చించి నిర్మాణం పూర్తి చేసిన తర్వాత ఖాతాలో డబ్బులు జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

### రైతుల్లో సందేహాలు

2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని ప్రతి మండలంలో సుమారు 10 షెడ్ల నిర్మాణం చేపట్టాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ లక్ష్యంగా నిర్దేశించింది. చాలా చోట్ల ఈ యూనిట్‌పై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో ముందుకు రావడం లేదు. 1,660 మందికి మంజూరు కాగా ఇప్పటి వరకు 696 మాత్రమే పూర్తి చేశారు. 707 మంది పనులు చేపడుతుండగా మరో 257 ఇంత వరకు పనులు ప్రారంభించలేదు. మరో ఐదు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో పురోగతిలో ఉన్న షెడ్లు పూర్తి చేస్తే డబ్బులు వస్తాయో లేదోనని రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం పురోగతిలో ఉన్న షెడ్ల నిర్మాణాలను ఈ నెల చివరిలోపు పూర్తి చేసి బిల్లులు పొందాలని రైతులకు సూచిస్తున్నారు.

# ప్రాణం తీసిన ఈత సరదా

- దండెంపల్లి కాల్వలో పడి విద్యార్థి మృతి



పోతుగంటి ఉదయ్‌కుమార్(ఫైల్)

నీలగిరి, మార్చి25 : ఆడుతూ పాడుతూ చదువుకుంటున్న విద్యార్థుల ఈత సరదా కాస్తా ప్రాణం తీసింది. అప్పటి వరకు వారితో ఉన్న స్నేహితుడు ఒక్కసారిగా కాల్వలో మునిగి చనిపోవడంతో అక్కడున్న మిగతా స్నేహితుల్లో విషాద చాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే నల్లగొండ పట్టణంలోని నాగార్జున డిగ్రీ కళాశాలలో బీ.కామ్ మొదటి సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు సరదాగా నల్లగొండ మండలం దండెంపల్లి దగ్గరలోని కెనాల్‌లోకి ఈత కోసం వెళ్లారు. అందులో ముగ్గురికి ఈత రాగా ఒకరికి పాక్షికంగా మరో ముగ్గురికి అసలు ఈత రాదు. ఈత రాని వారు కాల్వ గట్టుపై ఉండగా కొంచెం ఈత వచ్చిన పోతుగంటి ఉదయ్‌కుమార్(20) నీటి అంచున కూర్చొని ఈత కొట్టేందుకు ప్రయత్నం చేశాడు. ముగ్గురు కాల్వ అవతలి ఒడ్డుకు ఈత కొట్టుకుంటూ వెళ్తుండగా ఉదయ్‌కుమార్ అంచున ఉండి మెల్లమెల్లగా జారుకుంటూ కాల్వలోకి పడిపోయి మునిగిపోయాడు. కాల్వ అవతలికి వెళ్లిన స్నేహితులు ఉదయ్‌ను చూడగా కనిపించకపోవడంతో కేకలు పెడుతూ వెతికారు. కానీ ఎక్కడా కనబడకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ ఎస్ఐ సైదాబాబు గజ ఈతగాళ్లను పిలిపించి కాల్వలో వెతికించారు. సుమారు రెండు గంటలపాటు వెతుకగా ఉదయ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. అతడి తండ్రి పోతుగంటి సైదులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# నల్లగొండ మెడికల్ కళాశాలలో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

రామగిరి, మార్చి 25: నల్లగొండలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పలు పోస్టుల భర్తీకి మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలతో ఈ నెల 19న జారీచేసిన నోటిఫికేషన్ ఆధారంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 15 మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ప్రొఫెసర్ పోస్టులు 4, అసోసియేట్ ప్రొఫెసర్ 16 పోస్టులకు అభ్యర్థులు హాజరు కాలేదని అధికారులు వెల్లడించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ 15 ఖాళీలకు నలుగురు, సీనియర్ రెసిడెంట్ 12 పోస్టులకు ముగ్గురు, ట్యూటర్ 13 పోస్టులకు 8 మంది మాత్రమే హాజరైనట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలు మెడికల్ కళాశాల వెబ్‌సైట్‌లో ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, డాక్టర్ మినీలారాణి, డాక్టర్ మాతృ పాల్గొన్నారు.

# పాల బిల్లులు వస్తలేవు..



- నార్ముల్‌లో 5 బిల్లులు.. రూ.25 కోట్లు పెండింగ్
- పైసలు రాక పాలను బయట అమ్ముకుంటున్న వైనం
- 'విజయ'లోనూ నాలుగు బిల్లులు బాకీ
- సకాలంలో డబ్బులు అందక రైతుల అరిగోస
- ఈఎంఐలకు కష్టాలు.. ప్రైవేట్‌లో అప్పులు

## అటు మదర్ డెయిరీ.. ఇటు విజయ డెయిరీ

**పాడి రైతులు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. అరిగోస పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అటు ప్రభుత్వ సంస్థ మదర్ డెయిరీ, ఇటు స్వతంత్ర బాడీ మదర్ డెయిరీలో పాల బిల్లులు వస్తలేవు. నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లోనే మూలుగుతున్నాయి. ఇప్పటికే దాణా ధరలు పెరిగి రైతులు ఆపసోపాలు పడుతుండగా, బిల్లులు రాకపోవడంతో ఇంకింత పరేషాన్ అవుతున్నారు. నార్ముల్ నుంచి బకాయిలు రాకపోవడంతో రైతులు పాలను బయట ప్రైవేట్‌లో అమ్ముకుంటున్న దుస్థితి నెలకొంది. ఫలితంగా రోజురోజుకు సంస్థ పరిస్థితి దిగజారిపోతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

– యాదాద్రి భువనగిరి, మార్చి 25 (నమస్తే తెలంగాణ)

### మదర్ డెయిరీలో ఐదు బిల్లులు పెండింగ్

జిల్లాలో రైతులు అధికంగా పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అధిక శాతం మంది మదర్ డెయిరీకి పాలను అందిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 24 పాల శీతలీకరణ కేంద్రాలు ఉన్నాయి. 435 పాల సొసైటీల్లో 32 వేల మంది వరకు సభ్యులు ఉన్నారు. రోజూ సుమారు 50వేల లీటర్లకు పైనే పాలను విక్రయిస్తున్నారు. రైతుల వెన్న శాతాన్ని బట్టి ధరను నిర్ణయిస్తారు. పాడి రైతులకు 15 రోజులకోసారి బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. కొంత కాలంగా డబ్బులు సకాలంలో బ్యాంకుల్లో జమ కావడంలేదు. ఇటీవల నెలకు ఒక్క బిల్లు ఇచ్చి.. మరొకటి పెండింగ్‌లో పెడుతున్నారు. ఇలా ప్రస్తుతం 5 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కో బిల్లు సుమారు రూ. 5 కోట్ల వరకు ఉంటుంది. అంటే రూ. 25 కోట్ల వరకు రైతులకు చెల్లించాల్సి ఉంది.

### ఇటు బయట అమ్ముడు.. అటు బయట కొనుడు..

మదర్ డెయిరీ సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్‌టైంలో డబ్బులు రాకపోవడంతో కొంత మంది బయట అప్పులు చేయాల్సి వస్తున్నది. మరోవైపు రుణాలతో గేదెలను కొన్న రైతులు ఈఎంఐలు చెల్లించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. దాణా ధరలు కూడా పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో రైతులు మదర్ డెయిరీకి పాలు పోయడం మానేస్తున్నారు. బయట వేరే సంస్థలు ఎప్పటికప్పుడు బిల్లులు ఇస్తుండటంతో వారికే విక్రయిస్తున్నారు. ఫలితంగా మదర్ డెయిరీకి పాల కొరత ఏర్పడుతున్నది. దీంతో బయట గుజరాత్, కర్నాటక రాష్ట్రాల నుంచి మదర్ డెయిరీ పాలను కొంటూ కాలం వెల్లదీస్తున్నట్లు తెలుస్తున్నది. కమీషన్ల కోసం బయట వేరే సంస్థల నుంచి పాలు కొనేందుకు డెయిరీ పాలక వర్గం ఆసక్తి చూపిస్తున్నదని సొసైటీల సభ్యులు ఆరోపిస్తున్నారు.

### విజయ డెయిరీలోనూ పెండింగ్..

ప్రభుత్వ సంస్థ విజయ డెయిరీకి జిల్లాలో 2,500 మంది వరకు పాలను విక్రయిస్తుంటారు. పాల నాణ్యతను బట్టి ధరలను నిర్ణయిస్తారు. గతంలో బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించేది. ఇటీవల డబ్బుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నది. జిల్లాలో సుమారు నాలుగు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పాల ఉత్పత్తిదారులకు రూ. కోటికి పైగా బాకీ ఉంది. ఒక్కో రైతుకు సగటున నెలకు రూ. 20 నుంచి రూ. 50వేల వరకు బకాయిలు ఉన్నాయి. బడ్జెట్ లేకపోవడంతో ఆలస్యం అవుతున్నదని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ సంస్థల్లో విజయ పాలు, ఇతర ఉత్పత్తులు వినియోగించాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ఆయా సంస్థలు స్పందించి వెనువెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### కమీషన్ల కోసం 'మదర్ డెయిరీ' కక్కుర్తి



గతంలో ఎన్నడూ లేని విధంగా మదర్ డెయిరీ పాలక వర్గం వ్యవహరిస్తున్నది. సొసైటీ సభ్యులు, ఉద్యోగులు చీదరించుకుంటున్నారు. పాలు అమ్మే దగ్గర, కొనే దగ్గర కమీషన్ కోసం కక్కుర్తి పడుతున్నారు. గుజరాత్, కర్నాటక నుంచి పాలు కొంటూ.. లీటరుకు రూ. 2 కమీషన్ తీసుకుంటున్నారు. పాడి రైతులకు మాత్రం బిల్లులు ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్నారు. రైతులకు చెల్లించే డబ్బులతోనే బయట పాలను కొనుగోలు చేస్తూ.. వారికి అన్యాయం చేస్తున్నారు. ఎప్పటిప్పుడు బిల్లులు చెల్లించాలి. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తం.

**- దొంతిరి సోమిరెడ్డి, మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్**

### నాలుగు నెలల బిల్లులు రాలే



నేను మదర్ డెయిరీలో రోజూ 10 లీటర్ల పాలు పోస్తాను. ఇప్పటి వరకు నాలుగు పాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పాల బిల్లులు ఎప్పటికప్పుడు వస్తేనే రైతులకు మేలు జరుగుతుంది. గత ప్రభుత్వంలో బకాయిలు లేకుండా ఇచ్చేవారు. ప్రస్తుతం బిల్లులు బకాయిలు ఉండడంతో పశువులకు దాణా, గడ్డి సక్రమంగా పెట్టలేకపోతున్నాం. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా పాలకవర్గం పెండింగ్ బిల్లులు చెల్లించి రైతులను ఆదుకోవాలి.

**-సామల శ్రీకాంత్, పాడి రైతు, (ఆలేరు రూరల్)**

### మదర్ డెయిరీపై నమ్మకం పోతున్నది



మదర్ డెయిరీ పూర్తిగా అప్పుల్లో మునిగిపోయింది. ఇప్పటివరకు రైతులకు ఐదు బిల్లులు బకాయి పడ్డది. ప్రతి 15 రోజులకు ఒకసారి వచ్చే బిల్లు మూడు నెలలుగా ఇవ్వడం లేదు. బిల్లులు రాక పాడి రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు. పాల బిల్లుల రాక బయట అప్పులు తెచ్చి నడిపిస్తున్నారు. ఇప్పటికే మదర్ డెయిరీపై నమ్మకం కోల్పోయిన సగం మంది పాడి రైతులు ప్రైవేట్ డెయిరీలో పాలు పోస్తున్నారు. పాల సొసైటీ చైర్మన్‌గా ఉన్నందున మేము సంఘంలో పాడి రైతుల ముందు పరపతి కోల్పోయాం. బిల్లులు చెల్లించకపోతే మదర్ డెయిరీ ఆఫీసులకు రైతులు తాళం పెట్టే అవకాశాలు ఉన్నాయి.

**-సంధిల భాస్కర్‌గౌడ్, రాజాపేట పాల సొసైటీ చైర్మన్**

# కేంద్రాలు ప్రారంభించండి.. ధాన్యం కొనకండి!

## ధాన్యం సెంటర్ల నిర్వాహకులకు సివిల్ సప్లయ్ యంత్రాంగం ఆదేశాలు

- ఏప్రిల్ మొదటి వారం తర్వాతే కొనాలని సూచనలు
- రైతుల విమర్శలు తప్పించుకునేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు
- ఇప్పటికే పలు ప్రాంతాల్లో కేంద్రాలకు వచ్చిన ధాన్యం



ఆర్జాలబావి కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

నల్లగొండ, మార్చి 25 : గతేడాది యాసంగిలో ఏప్రిల్ మొదటి వారం వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుండా విమర్శలు ఎదుర్కొన్న ప్రభుత్వం ఈ సారి ఆ సమస్య రాకుండా ముందస్తుగానే జాగ్రత్త పడుతున్నది. కానీ కేంద్రాలు తొందరగా ప్రారంభమైనా ధాన్యం కొనుగోళ్లు మాత్రం ఆలస్యం చేయనున్నట్లు తెలుస్తున్నది. నల్లగొండ మండలంలోని ఆర్జాల బావితోపాటు తిప్పర్తి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఇప్పటికే ఆయా కేంద్రాలకు ధాన్యం వచ్చినప్పటికీ ధాన్యం మాత్రం కొనవద్దని నిర్వాహకులకు సివిల్ సప్లయ్ యంత్రాంగం ఆదేశాలు ఇచ్చిందట. ఏప్రిల్ మొదటి వారం తర్వాతే ధాన్యం కొనాలని సూచించటంతో అప్పటి వరకు కేంద్రాలు పేరుకే ఉండనున్నాయి.

### గన్నీ బ్యాగ్స్ లేవు.. కాంటాలు రాలేదు..

నల్లగొండ జిల్లాలో ఈ సీజన్‌లో 11.26 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా 12.14లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అధికారుల అంచనా. అందులో మిల్లర్లు 5.68లక్షల మెట్రిక్ టన్నులు కొంటే ప్రభుత్వ రంగ సంస్థల మార్కెట్లకు 5.57లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో ఇప్పటికే 10 నుంచి 20శాతం వరి కోతలు పూర్తి కాగా ఆ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. ధాన్యం కొనుగోలు చేయడానికి సోమవారం రెండు కేంద్రాలను మంత్రి ప్రారంభించగా ఆయా కేంద్రాలకు నామమాత్రంగా ఒక తూకం యంత్రం పంపారని, కొనుగోళ్లు మాత్రం వద్దన్నారని నిర్వాహకులే అంటున్నారు. ఈ సారి 1.39 కోట్ల గన్నీ బ్యాగులు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 25 శాతం మాత్రమే ఉన్నాయట. జిల్లాలో ఈ సారి 375 కేంద్రాలు ప్రారంభించి అందులో 71 కేంద్రాల ద్వారా సన్న ధాన్యం కొనాలని సూచించిన అధికారులు ఆయా కేంద్రాలకు గన్నీ బ్యాకులుగాని, కాంటాలు గాని పంపలేదు. ఇక కొన్న ధాన్యం వివరాలు అప్‌లోడ్ చేయడానికి ట్యాబ్స్ ఇవ్వకపోగా, వాటికి సంబంధించిన యాప్స్ కూడా చెప్పక ముందే ప్రారంభాలు చేయడం గమనార్హం.






తాసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

# ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

మిర్యాలగూడ, మార్చి 25 : కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మిర్యాలగూడలో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని, రైతు భరోసా నిధులు విడుదల చేయాలని, రైతులకు క్వింటాకు గిట్టుబాటు ధర రూ.2800 చెల్లించాలని కోరారు. ప్రతి ఇంటికీ ప్రతి సంక్షేమ పథకం అందాలని, అందులో రాజకీయ జోక్యం ఉండరాదని అన్నారు. పట్టణంలో బస్తీ దవాఖాన ఏర్పాటు చేసి ప్రభుత్వ వైద్యాన్ని పేదలకు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, గాదె పద్మమ్మ, తిరుపతి రామ్మూర్తి, సత్యనారాయణరావు, పిల్లుట్ల సైదులు, మల్లయ్య, రమేశ్, రామకృష్ణ, మాధవరెడ్డి, నగేశ్, ఆశీర్వాదం, అరుణ, సూర్యం, అప్పారావు, వెంకట్‌రెడ్డి, కరీం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మోత్కూరు మండలంలోని పాటిమట్ల రైతు వేదిక వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

# రైతు వేదికకు మెయింటెనెన్స్ నిధులు మంజూరు చేయాలి

- పాటిమట్ల రైతు వేదిక వద్ద రైతుల ఆందోళన

మోత్కూరు, మార్చి25 : రైతు వేదికకు మెయింటెనెన్స్ నిధులు మంజూరు చేయకపోవడంతో వివిధ కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుందని, వెంటనే ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని రైతులు కోరారు. మోత్కూరు మండలంలోని పాటిమట్ల రైతు వేదిక వద్ద మంగళవారం రైతులు ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం సంవత్సరం కాలంగా రైతు వేదికలకు మెయింటెనెన్స్ నిధులు ఇవ్వకపోవడంతో విద్యుత్ బకాయి చెల్లించలేదు. దీంతో విద్యుత్ అధికారులు కరెంట్ కనెక్షన్ తొలగించారు. రైతు వేదికలో మంగళవారం జరుగాల్సిన రైతు నేస్తం..వీసీ ప్రోగాం, వేసవిలో పశుగ్రాసం- యాజమాన్య పద్ధతులపై నిర్వహించాల్సిన కార్యక్రమం ఆగిపోవడంతో రైతులు ఆందోళన దిగారు. కార్యక్రమంలో రైతులు దొండ నర్సయ్య, గిరగాని శ్రీనివాస్, బోనుగ నరేందర్‌రెడ్డి, ఏనుగు జితేందర్‌రెడ్డి, ఎం. విజయ్‌రెడ్డి, తుంగపాటి లచ్చయ్య, పురుగుల నర్సయ్య పాల్గొన్నారు.

# బిర్యానీ సెంటర్‌లో భారీ పేలుడు

- చెల్లాచెదురై రోడ్డుపై పడిన వస్తువులు.. తప్పిన పెను ప్రమాదం

నీలగిరి, మార్చి25 : నల్లగొండ జిల్లా కేంద్రంలో పూజిత అపార్టుమెంట్ ఎదురుగా ఉన్న హాట్ బకెట్ బిర్యానీ సెంటర్లో సోమవారం అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి బిర్యానీ సెంటర్ షట్టర్, గేటు సహా లోపల ఉన్న సామాన్లు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. అర్ధరాత్రి సమయంలో పేలుడు జరుగడంతో పెను ప్రమాదం తప్పింది. పేలుడు శబ్దానికి నల్లగొండ పట్టణంలో ఒక్కసారిగా అలజడి నెలకొంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంజాన్ మాసం ప్రారంభం కావడంతో హాట్ బకెట్ బిర్యానీ సెంటర్ సోమవారం అర్ధరాత్రి వరకూ తెరిచి ఉంది. సెంటర్ మూసి వేసిన 15నిమిషాల వ్యవధిలోనే బిర్యానీ సెంటర్‌లో పేలుడు సంభవించింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం జరుగలేదు. వెంటనే ఫైరింజన్ ద్వారా మంటలను ఆర్పారు. పేలుడు గ్యాస్ సిలిండర్ వల్ల జరిగిందా, షార్ట్ సర్క్యూట్ ద్వారా జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బిర్యానీ సెంటర్ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు నల్లగొండ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





పేలుడు ధాటికి బయట రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన సామగ్రి